తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్



వైద్య సేవలపై రోగితో మాట్లాడుతున్న కలెక్టర్

కుప్పం, జూలై 11 ప్రభాతవార్త : కుప్పం ప్రాంతంలోని పేద ప్రజలకు కుప్పం ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దూర ప్రాంతాలనుంచి వైద్యులపై ఎంతో నమ్మకంతో వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి ఆదుకోవాలన్నారు. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన బెడ్‌షీట్లు, ఆపరేషన్ పరికరాలను ఆస్పత్రి అభివృద్ధి నిధి నుంచి కొనుగోలు చేయాలని ఎంఎస్ విజయకుమారిని ఆదేశించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు అ ందించడం జరుగుతుందన్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆర్థికసాయం అందిస్తే వాటిద్వారా సైతం ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. క ందుకూరు ప్రాంతీయ ఆస్పత్రిని దాతలు అందించిన కోటి రూపాయలసాయంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కాగా ఏరియా ఆస్పత్రికి రోజుకు 450- 500మంది రోగులు వస్తుంటారని, ఆస్పత్రిలో ఆర్థో, గైనిక్, డెంటిస్ట్, స్కిన్, ఆప్తమాలజిస్ట్ సంబంధిత వైద్యులు ఉన్నారని, అనస్తీషియా వైద్యులు లేరని ఎంఎస్ వివరించారు. కాగా శానిటరేషన్ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు లేవని, ఆస్పత్రి ప్రహరీగోడ ఎత్తు పెంచాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, డిసిహెచ్ డా॥ రాజశేఖర్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

# తిరుపతిలో పొలిటికల్ కోల్డ్‌వార్!

**-జనసేన పార్టీలో రగులుతున్న ఇంటిపోరు -వైసిపి కార్పొరేటర్ల నోట వ్యతిరేక మాట**



**తిరుపతి,ప్రభాతవార్త న్యూస్ నెట్‌వర్క్**

సంచలనాల రాజకీయాలకు వేదికగా మారిన తిరుపతి నియోజకవర్గంలో నెలరోజులుగా రాజకీయ పార్టీల మధ్య పొలిటికల్ కోల్డ్‌వార్ నడుస్తోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి నుండి జనసేన ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు గెలిచారు. ఆయన గతంలో చిత్తూరులో వైసిపి ఎమ్మెల్యేగా ఉంటూ పార్టీ మారి కూటమి తరపున తిరుపతికి వచ్చి జనసేనలో గెలవడం,సొంత పార్టీ నాయకులను పట్టించుకోవడం లేదనే విమర్శలు బహిరంగంగా వ్యక్తమవుతు న్నాయి. ఇప్పటికే సొంతపార్టీ జనసేనలో కొందరు నాయకులు ఆయనకు వ్యతిరేకంగా ముఖం చాటేశారనేది జనసైనికుల నోట వినిపిస్తోంది. అయితే పార్టీ మారి వచ్చినా తిరుపతిలో టిడిపి బలమైన కేడర్,కార్యకర్తలు, ఓటు బ్యాంకుతోనే ఆరణి ఎమ్మెల్యేగా గెలిచారనేది టిడిపి నేతలు, నగరజనం నోట వినిపిస్తోంది. తిరుపతిలో జనసేనపార్టీ కంటే కూడా టిడిపి బలమైన ఓటుబ్యాంకు కలిగి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నియమించే నామినేటెడ్‌పదవులల కోసం అటు టిడిపి ఇటు జనసేన, బిజెపి పార్టీల నేతలు తమతమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే ఆరణి ధోరణితో టిడిపినేతలతోబాటు జనసేన నేతలుకూడా ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో వైసిపి నుండి జనసేన కండువాలు కప్పుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నా రని 50 డివిజన్లలో ద్వితీయశ్రేణి నేతలు ఆరోపిస్తున్నారు. ఒకప్పుడు తిరుపతి జిల్లాలోనేగాక ఉమ్మడిచిత్తూరుజిల్లాలో జనసేన పార్టీ పేరుచెబితే డాక్టర్ హరిప్రసాద్, కిరణ్‌రాయల్ అనే గుర్తుచేసుకునేవారు. అయితే గత కొంతకాలంగా వీరికి తగిన గుర్తింపు లేకపోతోందని జనసేన పార్టీ నేతలు బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తుండటం విశేషం. పాత పరిచయాలు ఉండటంతో వైసిపి నేతలతో సఖ్యతగా మెలగుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. అయితే ఎన్నికల సమయంలో చిత్తూరునుండి తిరుపతికి వచ్చినపుడు తనను గోబ్యాక్ అన్నవారేవరో తెలుసునని, తన ఓటమిని కోరుకున్న టిడిపి, జనసేన నాయకులెవరో తెలుసునని ఇటీవల బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం ఆ పార్టీల్లో అసంతృప్తిని మరింత రగిల్చింది. జనసేనకు తిరుపతిలో 50 డివిజన్లలో కనీసం అంటే నాయకత్వం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవాలని టిడిపి నేతలు చెబుతున్నారు. మరీ జనసేన,టిడిపి పార్టీల్లో నేతలతో ఆరణి శ్రీనివాసులు ఎంతవరకు సఖ్యతగా నడుస్తారనేది మాత్రం కాలమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యలు బలంగానే వినిపిస్తున్నాయి. ఇదేగాక గత నాలుగు రోజులుగా తిరుపతిలో జరుగుతున్న కృతజ్ఞత సమావేశాల్లో కూడా ముస్లింలకు తగిన ప్రాధాన్యత లేకపోతోందని, ఆ జెఎసి అసంతృప్తితోఉంది. ఇక గత వైసిపి ప్రభుత్వంలో కార్పొరేటర్లుగా ఎన్నికైన వారుకూడాసొంత పార్టీపై బుధవారం నాటి కౌన్సిల్ సమావేశంలో విమర్శలు గుప్పించడం ఆ పార్టీలో రగులుతున్న కోల్డ్‌వార్‌ను బహిరంగ చేసింది. మరీ తిరుపతిలో రాజకీయ వార్ ఎక్కడకు దారితీస్తుందనేది,ఎమ్మెల్యే ఈ వ్యతిరేకతను ఎలా సానుకూలంగా మలచుకుంటారనేది జనం నిశితంగా గమనిస్తున్నారు.

## ఎర్రచందనం రవాణా కేసులో నిందితుడి అరెస్ట్



పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో నిందితుడు

తడ, జూలై 11 ప్రభాతవార్త: ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో తెల్ల వంకాయల మాటున పట్టుబడిన ఎర్రచందనం రవాణా కేసులో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. కడప జిల్లా అట్లూరు మండలం కాటమవారిపల్లె గ్రామానికి చెందిన కత్తి వెంకటసుబ్బయ్య (30)ను పోలీసులు పట్టుకున్నారు. అయితే ఈ కేసుకు సంబంధించిన తమిళనాడుకు చెందిన పార్థివన్, కార్తీక్, కమల్‌నాథ్‌లతో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు వివరాలను పోలీసులు తెలియజేస్తూ.. జూలై 10న ఉదయం 6 గంటలకు తడ మండలం భీములవారిపాలెం వద్ద తమకు అందిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనం పట్టుబడింది. సూళ్లూరుపేట సీఐ ఎం.మధుబాబు, తడ ఎస్ఐ పి.నరసింహారావు, వారి సిబ్బంది చెన్నై వైపు వెళ్లే వాహనాలు తనిఖీ చేస్తుండగా సరుకుతో పాటు మొదటి ముద్దాయిని పట్టుకున్నారు. పట్టుబడిన సొత్తులో 875.7 కిలోల 27 ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. వీటి విలువ 35 లక్షల 3 వేల రూపాయలుగా లెక్కించారు. వాహనంతో పాటు ఒక సెల్‌ఫోన్, రూ.17,500 నగదు కూడా స్వాధీనం చేసుకున్నామని పోలీసులు చెప్పారు. మొత్తం విలువ 41 లక్షల 71 వేల 500 కాగా, నిందితుడు వెంకటసుబ్బయ్యను సూళ్లూరుపేట కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

## ఆధునిక వ్యవసాయం రైతులకు లాభదాయకం : కలెక్టర్



డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వరులు

వడమాలపేట, జూలై 11 ప్రభాతవార్త: ఆధునిక పద్ధతులతో వ్యవసాయం రైతులకు లాభదాయకమని తిరుపతి జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వరులు తెలిపారు. మండలంలోని కదిరిమంగళం గ్రామంలో రైతుల పొలాలను సందర్శించి వరిపైరులో డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారి చేసే పద్ధతిని, డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేసిన వరిని పరిశీలించి రైతులతో ముఖా ముఖి చర్చించారు. రైతుల అనుభవాలు సాగు ఖర్చులు నూతన సాంకేతిక పద్ధతుల గురించి రైతులతో మాట్లాడి వారి కష్ట నష్టాలను తెలుసుకుని వారికి సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుని అధిక దిగుబడి సాధించే విధంగా తయారవ్వాలని అందుకు కావలసిన సదుపాయాలను ప్రభుత్వం ద్వారా అందించ డానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు. కౌలు రైతులకు కౌలు రైతుల కార్డు, పచ్చిరొట్టి ఎరువుల విత్తనాలు జీలుగ అందజేసి పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఫిజికల్ వెరిఫికేషన్ రికార్డులను ఫేషియల్ యాప్ ద్వారా రికార్డు చేసి వారికి పీఎం కిసాన్ నిధులు పొందడానికి అప్రూవ్ చేయడం జరిగింది. రాస్ కృషి విజ్ఞానకేంద్రం కరకంబాడి వారి ద్వారా డ్రోన్‌తో వరిపైరుపై పిచికారి కార్యక్రమాన్ని పరిశీలించి సులభతరమైన నూతన సాంకేతిక పద్ధతులను రైతులు పాటించాలని చెప్పారు. అనంతరం పాదిరేడు గ్రామంలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా అందజేసిన పామాయిల్ మొక్కలు సాగు చేసిన పొలాన్ని సందర్శించి రైతు అనుభవాలను తెలుసుకున్నారు. ఏపీఎంఐపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఇచ్చిన మైక్రో స్ప్రింక్లర్స్ వేసిన వేరుశనగ పొలాన్ని సందర్శించి రైతుల అనుభవాలను తెలుసుకున్నారు. స్ప్రింక్లర్స్ ద్వారా ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్, పుత్తూరు ఏడీఏ రమేష్, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు, విస్తారణ అధికారి రామ్ కుమార్, వడమాలపేట తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవో సుజాతమ్మ, వ్యవసాయ అధికారి విజయకుమార్, పీఆర్ఏఈ నరసింహులు, ఎలక్ట్రిసిటీ ఏఈ భాస్కర్‌రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రామ్మోహన్, మండల స్థాయి అధికారులు, గ్రామ రైతులు దినకర్ చౌదరి, రవి, బత్తి నాయుడు, వీరస్వామినాయుడు, మునికృష్ణమనాయుడు, దామోధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగుల దాడుల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృశ్యం

పలమనేరు,జూలై 11 ప్రభాతవార్త: ఏనుగుల దాడుల నివారణకు ప్రత్యేక చర్యలను చేపట్టనున్నామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద గురువారం ఆయన ఆధ్వర్యంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీం ఎలిఫెంట్ డ్రైవ్ వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం పెద్దపంజాణి మండలం, పెదకాప్పల్లె పంచాయితీ జిట్టంవారిపల్లెలో ఏనుగుల దాడిలో మృతి చెందిన గంగయ్య భార్యకు రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే,డిఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలమనేరు నియోజకవర్గంలో ఏనుగులు దాడిలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గ్రామాలపై ఏనుగుల దాడి నివారణకు ఇప్పటికే ట్రెంచ్‌లు,సోలార్ ఫెన్సింగ్‌లు, హ్యాంగింగ్ ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేశామని అయినప్పటికి పూర్తిస్థాయిలో కట్టడి చేయలేని పరిస్థితి ఉందన్నారు. కర్ణాటక రాష్ట్రం నుండి శిక్షణ పొందిన ఏనుగులను తీసుకురావడం ద్వారా అడవిలోని ఏనుగులను కట్టడి చేయడం సాధ్యమని డిఎఫ్ఓ తెలిపారని త్వరలో ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళుతామన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరి ఆ శిక్షణ పొందిన ఏనుగులను పలమనేరు నియోజకవర్గానికి తీసుకురాగలిగితే గ్రామాలలోకి ఏనుగులు రాకుండా కట్టడితో పాటు పర్యాటక ప్రాంతంగాను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు.ఎక్స్‌ప్రెస్ హైవే కొరకు అటవీ శాఖ భూములు సుమారు 65 హెక్టర్లు రోడ్డు నిర్మాణాకి తీసుకోవడం జరిగిందని నష్ట పరిహారంగా అటవీ శాఖకు రూ.18కోట్లను అందించారన్నారు. ఈ నగదును నియోజకవర్గంలో ఏనుగుల దాడుల నివారణ,పర్యటక అభివృద్ధికి ఉపయోగించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లనున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శివన్న, ఎఫ్.బి.ఓలు,టిడిపి నాయకులు ఆర్.వి.బాలాజీ,ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, నాగరాజు, సుబ్రమణ్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో రేషన్ బియ్యం పట్టివేత



ఎస్‌పిటి 1 : పోలీసులకు పట్టుబడిన బియ్యం లారీ

సూళ్లూరుపేట, జూలై 11 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి సినీఫక్కీలో దాడి నిర్వహించి సూళ్లూరుపేట పరిసర ప్రాంతాల నుంచి అక్రమంగా నెల్లూరుకు తరలుతున్న రేషన్ బియ్యం లారీని పట్టుకున్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట ఆర్డీఓ ఆర్.చంద్రముని మాట్లాడుతూ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో తహశీల్దార్ గోపాలకృష్ణ బుధవారం రాత్రి జాతీయ రహదారిపై కాపుకాచి స్థానిక టోల్‌ప్లాజా వరకు లారీని వెంబడించి, ఆ లారీలోని బియ్యం బస్తాలతో సహా పట్టుకొని పోలీసుస్టేషన్‌కు స్వాధీనం చేశారని తెలిపారు. గురువారం ఉదయం పట్టుబడిన ఈ బియ్యాన్ని సూళ్లూరుపేట సివిల్ సప్లయిస్ గోడౌన్‌కు తరలించారు. ఈ లారీలో సుమారు 26 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఈ బియ్యం తమిళనాడుకు సంబంధించిందా లేక ఆంధ్రాకు చెందినదా త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఈ సందర్భంగా లారీడ్రైవర్ చంద్రను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సిఐ మధుబాబు, తహశీల్దార్ గోపాలకృష్ణ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో అప్పగించారు.

# రాత్రి వేళల్లో ఆలయ భద్రత పెంచాలి!



సమావేశంలో పాల్గొన్న అధికారులు

శ్రీకాళహస్తి,జూలై 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాత్రి గస్తీని పెంచాలని గురువారం జరిగిన సెక్యూరిటి ఆడిట్ సమావేశంలో రాష్ట్ర స్థాయి అధికారులు సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాయంలో 2020లో ఇలాంటి సమావేశం జరిపారు. అప్పటిలో పలు సూచనలు చేసారు. వాటిని అమలు చేసారా? లేదా? అని పరిశీలించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం కొండ కొనల పక్కన ఉంది, కాబట్టి ఇక్కడ భద్రతను పటిష్టం చేసుకోవాల్సి ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర సెక్యూరిటి ఆడిట్ విభాగానికి చెందిన అధికారి విశ్వనాథ్ విచ్చేసారు. ఆయన సారథ్యంలో ఆలయాధికారి ఎన్‌వియస్ ఎన్ మూర్తి, శ్రీకాళహస్తి డివైయస్‌పి ఉమామహేశ్వరరెడ్డిల పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని పలు ప్రముఖ ఆధ్మాత్మిక క్షేత్రాల్లో భద్రతకు సంబంధించి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ మేరకు సమావేశం నిర్వహించారు. 2020లో నిర్వహించిన సమావేశంలో కూడా ఆలయ భద్రతకు సంబంధించి పలు సూచనలు చేసారు. అందులో ముఖ్యంగా ఈ దివ్యక్షేత్రం తమిళనాడు సరిహద్దుల్లో ఉంది కాబట్టి భద్రతను పెంచాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అంతేకాక ఆలయంలో కూడా దూర ప్రాంతాల నుంచి వచ్చే వారిని సమగ్రంగా తనికి చేయాలని సూచించారు.కానీ పరిస్థితి మారలేదని గుర్తించారు. గురువారం ఈ విభాగం పలు ప్రాంతాలను అక్కడ ఉన్న భద్రతను పరిశీలించారు. తరువాత సమావేశం హాలులో సెక్యూరిటి సిబ్బంది, హోం గార్డులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులకు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ సూచనలు చేస్తూ అంతా బాగానే ఉంది.కానీ సువిశాలమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి రాత్రివేళలో గస్తీని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. అంతేకాక ఆలయానికి అగ్నిమాపక కేంద్రానికి దూరం ఎక్కువగా ఉంది. కాబట్టి ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడి ఇబ్బంది కాబట్టి దేవస్థానం ఓ అగ్నిమాపక వాహనాన్ని ఏర్పాటు చేసుకోవటం మంచిదని అభిప్రాయపడ్డారు.ఈ సమావేశంలో ఇంటిలిజెన్స్ డివైయస్‌పి విశ్వనాథ్ వారి బృందం, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్‌వియస్ఎన్ మూర్తి, శ్రీకాళహస్తి డివైయస్‌పి ఉమామహేశ్వరరెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఎస్‌పిఎఫ్ ఎన్స్పెక్టర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్య పరిష్కరించేలా చర్యలు!

**-డయల్ యువర్ ఎమ్మెల్యేకు అనూహ్య స్పందన - ప్రజల నుండి సమస్యలపై 39 ఫిర్యాదులు స్వీకరణ**

**- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు**



డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చిత్తూరు, జులై 11 ప్రభాతవార్త: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు వినూత్నంగా గురువారం నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, చిత్తూరు రూరల్ మండలం, గుడిపాల మండలాల నుండి ప్రజలు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి ఫోన్ చేసి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు తమ ప్రాంత సమస్యలను విన్నవించి వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు స్పందిస్తూ సత్వరం క్షేత్ర స్థాయికి అధికారులు వచ్చి సమస్యలను పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి వచ్చిన సమస్యలను మరో గురువారంలోపు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, మేయర్ అముద, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి, చిత్తూరు రూరల్, గుడిపాల మండల అధికారులు హాజరయ్యారు.

ప్రజలు మెచ్చేలా పనులు పూర్తి

**- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు**

ప్రజలు మెచ్చేలా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అధికారులతో పేర్కొన్నారు. డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో ప్రదానంగా డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు, రోడ్లు, పారిశుధ్యంపై ఎక్కువ ఫిర్యాదులు అందాయని వీటిని పరిష్కరించడానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగర పరిధిలో పారిశుధ్య నిర్వహణ, ఇళ్ల నిర్మాణం, రోడ్లు, వీధి లైట్లు ఏర్పాట్లపై అధికారులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మార్గనిర్దేశం చేశారు. మండల స్థాయిలో పోలీసులు ఫిర్యాదిదారులతో మాట్లాడి సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవవాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో, అభివృద్ధి పనులు చేపట్టడంతో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేయడం, సమస్యలను పరిష్కరిస్తాం అని భరోసా ఇచ్చి అటు ప్రభుత్వానికి ఇటు స్థానికంగా ఎమ్మెల్యేకు మంచిపేరు తీసుకురావాలని అధికారులను ఆయన కోరారు. నగర పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధుల కొరత నెలకొందని, ప్రజలు మున్సిపాల్టీకి చెల్లించాల్సిన పన్నులను సకాలంలో చెల్లిస్తే అభివృద్ధి పనులను వేగవంతం చేయవచ్చునన్నారు. చిత్తూరు నగరంను స్మార్ట్ సిటీగా రూపొందించడానికి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, సిఎం నారా చంద్రబాబునాయుడులను కలిసి అదనపు నిధులను సాధిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

**పార్లపల్లి వద్ద రోడ్డు ప్రమాదం...**

## ముగ్గురు యువకుల దుర్మరణం

తొట్టంబేడు,జూలై 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి చెన్నై మార్గంలోని తొట్టంబేడు మండలం సరిహద్దుల్లోని పార్లపల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒరిస్సాకు చెందిన ముగ్గురు యువకులు దుర్మణం పాలయ్యారు. ద్వి చక్రవాహనంపై శ్రీకాళహస్తి వైపు వస్తున్న యువకుల్ని చెన్నై వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొన్నట్లు భావిస్తున్నారు. బతుకు జీవనం కోసం దేశం కాని దేశం వచ్చి జీవనం గడుపుతున్న యువకుల దుర్మరణం పలువురిని కలచి వేసింది. ఒరిస్సాకు చెందిన ముగ్గురు యువకులు రాజు సింగ్, బఫున్ సింగ్, శుక్రదేవ్‌లు ఆలత్తూరుకు సమీపంలోని శ్రీనిధి ప్యాకింగ్ సెల్యూషన్ పరిశ్రమలో దినసరి కూలీలుగా పని చేస్తున్నట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. ముగ్గురు స్నేహితులు శ్రీకాళహస్తిలో పనిగా వచ్చి తిరిగి తమమోటార్ సైకిల్‌పై వెళుతుండగా కారు ఢీ కొన్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో ముగ్గురు స్నేహితుల తలలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.బతుకు జీవనం కోసం వచ్చినముగ్గురు స్నేహితుల మరణంలోనూ ఒకటిగా తుది శ్వాస విడిచారు.సంఘటన సమాచారం అందుకున్న వెంటనే శ్రీకాళహస్తి డిఐయస్‌పి ఉమామహేశ్వరరెడ్డి టూటౌన్ సిఐ రారాజు, ఎస్ఐ వెంకట్ నరసింహారావులు అక్కడికి చేరుకున్నారు.అప్పటికే ముగ్గురు మృతి చెందారు. మృతదేహాలను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసారు.కారు డ్రైవర్ పరారయ్యాడు. జరిగిన సంఘటనకు సంబంధించి ఫ్యాక్టరీ యాజమాన్యానికి, ఒరిస్సాలోని బాధితుల కుటుంబాలకు సమాచారం అందించారు.

## రూ.27లక్షల విలువ చేసే మద్యం ధ్వంసం

పలమనేరు,జూలై 11 ప్రభాతవార్త: పలు కేసులలో పట్టబడిన అక్రమ మద్యాన్ని గురువారం ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు,పలమనేరు సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్ రావు మాట్లాడుతూ పలమనేరు పోలీస్ స్టేషన్, లమనేరు సెబ్ స్టేషన్, బైరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో కర్నాటక నుండి అక్రమంగా మద్యం తరలిస్తు పట్టబడిన మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు. పలమనేరు సెబ్ కార్యాలయ పరిధిలో 66 కేసులలో రూ.1.30లక్షల విలువ చేసే 190లీటర్ల మద్యాన్ని,పలమనేరు పోలీస్ స్టేషన్ పరిధిలో 82 కేసులలో రూ.17.98లక్షలు విలువ చేసే 2570లీటర్ల మద్యాన్ని,బైరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో 56 కేసులలో రూ.8లక్షలు విలువ చేసే 1143 లీటర్ల మద్యం ధ్వంసం చేశామని తెలిపారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు అక్రమ మద్యం, నాటుసారా బట్టీల అన్వేషణలో ఉన్నారన్నారు. అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవి,సెబ్ సిఐ సురేష్,ఎస్ఐ దత్తాత్రేయ తదితరుతు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు

**గుడిపాల, జులై 11 ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా, జైలు తప్పదని ఎస్ఐ నరేంద్రకుమార్ అన్నారు. ఎన్ఆర్ పేట వద్ద గురువారం ఎస్ఐ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి కుటుంబ సభ్యులు అపరాధ రుసుం చెల్లించాల్సి వుంటుందని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

## రూ.12 లక్షల విలువైన కర్నాటక మద్యం ధ్వంసం

**చిత్తూరు, జులై 11 ప్రభాతవార్త:** చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల పోలీసులకు పట్టుబడిన 12 లక్షల రూపాయల విలువైన కర్నాటక మద్యంను గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు రెడ్డిగుంట చెక్‌పోస్ట్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల వివిధ సందర్భాల్లో 30 ప్రాంతాల్లో కర్నాటక అక్రమ మద్యం పట్టుబడటంతో 30 కేసులు నమోదు అయ్యాయి. ఈ మేరకు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథరెడ్డి, ఎస్ఇబి సూపరిటెండెంట్ శ్రీధర్‌రావు, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిటెండెంట్ ఎం.రవిల ఆధ్వర్యంలో సిబ్బంది ఈ మొత్తం కర్నాటక అక్రమ మద్యం నిల్వను రోడ్డు రోలర్ ఎక్కించి ధ్వంసం చేశారు.

## కుక్కల దాడిలో జింక మృతి

**గుడిపాల, జులై 11 ప్రభాతవార్త:** గుడిపాల మండలం పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంలో కుక్కల దాడితో గురువారం ఓ జింక మృతి చెందింది. అటవీ ప్రాంతం నుండి దారి తప్పి ఓ జింక అటవిరేను గ్రామంలోకి చొరబడి వీధి కుక్కల కంట పడింది. కుక్కలు ముకుమ్మడిగా జింకపై దాడి చేయడంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది.

## ఆధునాతన బస్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు : ఎమ్మెల్సీ



**కుప్పం, జులై 11 ప్రభాతవార్త :** కుప్పం పట్టణంను మోడల్ టౌన్‌గా మార్చే క్రమంలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మోడల్ బస్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం కుప్పం బస్టాండులో 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మోడల్ బస్‌స్టేషన్ ఏర్పాటుకు డిపిఆర్ అందించాలని రవాణాశాఖమ ంత్రి, సిఎంఒ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించి ఉన్నారన్నారు. కార్యక్రమాల్లో నేతలు కన్నన్, జాకీర్, బాలాజీ, మణి, కౌన్సిలర్ జిమ్‌దాము, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌స్ట్రిప్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



**శాంతిపురం/రామకుప్పం, జులై 11 ప్రభాతవార్త :** శాంతిపురం,రామకుప్పం మండలాల పరిధిలోని అమ్మవా రిపేట, కృష్ణ రాజపురం, విజలాపుర ం, కిలాక్ పోడు ప్రాంతాల్లో గతంలో ఎంపిక చేసిన ఎయిర్‌స్ట్రిప్ నిర్మాణ స్థలాన్ని గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. సిఎం చంద్రబాబు నాయుడు ఇటీవలే ఎయిర్‌స్ట్రిప్ నిర్మాణం సాధ్యమైనంత త్వరగా నిర్మించి ఈ ప్రాంతం నుంచి రైతుల ఉత్పత్తులు ఎగుమతులు చేపట్టేలా చూస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే సేకరించిన భూమికి రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని, కోర్టు సమస్యలో ఉన్న భూములను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత ్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు నరసింహులు, మునస్వామి, పట్రనారాయణ, దేవరాజు, రామూర్తి, ఆర్డీఓ శ్రీనివాసులు, తహశీల్దార్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ

**రామకుప్పం, జులై 11 ప్రభాతవార్త :** మండలంలోని ఆనిగానూరు రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు ప్రభుత్వం తరపున రాయితీతో మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి మునస్వామి, నేతలు రామూర్తి, కృష్ణారెడ్డి, షణ్ముగం, మహేంద్రనాయుడు, శంకరాచలం, మహేష్‌నాయుడు, సుభాష్ పాల్గొన్నారు.

## క్రికెట్ బ్యాట్ పట్టిన్న జిల్లా కలెక్టర్ : ఎమ్మెల్సీ



**కుప్పంరూరల్, జులై 11 ప్రభాతవార్త :** అసలే సిఎం ఇలాఖా, అధికారుల ఉరుకులు, పరుగులు, అభివృద్ధి పనులకు స్థలాల ఎంపిక ఇలా అధికారులు, ప్రజాప్రతినిధులు బిజీగా మారారు. గురువారం కుప్పం మండలం జరుగు గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌లు గ్రామంలో యువత క్రికెట్ ఆడుతుండగా వీరు కూడా సరదాగా కాసేపు బ్యాట్ పట్టి యువతను

## మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యం

**గుడిపాల, జులై 11 ప్రభాతవార్త:**



ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా మండల సమాఖ్య ద్వారా డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలను మంజూరు చేస్తోందని వెలుగు ఎపిఎం సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని ఐకెపి కార్యాలయంలో గురువారం ఎపిఎం సుధారాణి అధ్యక్షతన వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపిఎం మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే వడ్డీ లేని రుణాలు పొందవచ్చునన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాల గురించి ఎప్పటికప్పుడు యానిమేటర్లు సిసిల ద్వారా సమాచారం తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మాజీ జడ్పీటిసీ సుమతి, ఎంపిటిసీ విజయలక్ష్మీ, మాజీ ఎంపిటిసీ సాంబశివనాయుడు, సిసిలు హేమచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, ఇతర సంఘమిత్రలు పాల్గొన్నారు.

## దోమ లార్వాల కట్టడికి గంబూసియా చేప పిల్లలు

**చిత్తూరు, జులై 11 ప్రభాతవార్త:** స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2024, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ నిల్వ నీటిలో దోమ లార్వాలను నియంత్రించడానికి గంబూసియా చేప పిల్లలను విడిచింది. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాల మేరకు చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోని చెరువులు, లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ వున్న ప్రాంతాల్లో గురువారం లక్షకు పైగా గంబూసియా చేప పిల్లలను మున్సిపల్ పారిశుధ్య విభాగం సిబ్బంది వదిలారు. ఈ చేప పిల్లలు నీటిలోని దోమ లార్వాలను మాత్రమే తిని జీవిస్తాయి. దోమ లార్వాలను గణనీయంగా నాశనం చేయడం ద్వారా దోమలను కట్టడి చేయడానికి నిల్వ నీటిలో మున్సిపల్ సిబ్బంది గంబూసియా చేప పిల్లలను విడుస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్, అసిస్టెంట్ మలేరియా అధికారి డాక్టర్ చంద్రారెడ్డి, అర్బన్ సబ్‌యూనిట్ అధికారి రామకృష్ణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అమరనాథరెడ్డి, మలేరియా అసిస్టెంట్ మురళీ, వార్డు కార్యదర్శులు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## చాతుర్మాస మహాయాగ ఉత్సవం

**బంగారుపాళ్యం, జులై 11 ప్రభాతవార్త:** స్వయంభూ శ్రీ మొగిలీశ్వరాలయంకు అనుబంధంగా దేవరకొండపై గురువారం చాతుర్మాస మహాయాగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు శివపార్వతుల గోశాల నందు ఐదు రోజుల పాటు వేద పండితుల మంత్రోచ్ఛారణలతో చేపట్టారు. కంచి కామకోటి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వాముల ఆశీస్సులతో ఈ మహాయాగ ఉత్సవంను పాణ్యం శ్రీనివాసశర్మ నిర్వహించారు. గోశాల నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో దంపతులు ఈ యాగం నందు పాల్గొన్నారు. మొగిలి, మొగిలిమిట్టూరు, గాండ్లపల్లి, మొగిలివారిపల్లి, వరిగిపల్లి, గౌరిశంకరపురం, లక్ష్మీపురం పరిసర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర వేదిక్ విశ్వ విద్యాలయ ఉపకులపతి రామ్మూర్తిశర్మ, అర్చకులు శివకుమార్ శర్మ, శ్రీనివాసులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పక ధరించండి : జడ్జి శ్రీనివాసరావు

**పలమనేరు,జులై 11 ప్రభాతవార్త:** ద్విచక్రవాహనదారులు తప్పని సరి హెల్మెట్‌లు ధరించి ప్రయాణం చేయాలని సీనియర్ సివిల్ కోర్డు జడ్జి శ్రీనివాసరావు సూచించారు.స్థానిక బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయ వాదులు పరమశివప్ప, ఎల్.భాస్కర్, కృష్ణమూర్తిలు,న్యాయవాదులు స్థానిక బసవన్నకట్ట వీధి నుండి న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాలలో మృతి చెందుతున్నారని,ద్విచక్రవాహనాలలో ప్రయాణించే క్రమంలో తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి పరీక్షల అనంతరమే ప్రజలకు సరఫరా చేపట్టాలి : కమీషనర్

**పలమనేరు,జులై 11 ప్రభాతవార్త:** ప్రజలకు అందిస్తున్న నీటిని పలు రకాల పరీక్షల అనంతరమే ప్రజలకు సరఫరా చేస్తున్నామని మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి తెలిపారు.పట్టణంలోని పలు ప్రాంతాలలో గురువారం కమీషనర్ నీటి ట్యాంకులను,నీటి పంపిణీ కేంద్రాలను పరిశీలించారు.ట్యాంకులలో ఉన్న నీటిని క్లోరో స్కోప్ ద్వారా పరీక్షించారు.పంపింగ్ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని హెచ్2ఎస్ పరీక్షల ద్వారా నీటి నాణ్యతను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పద పాఠశాల స్థలాన్ని పరిశీలించిన డీఆర్ఓ

**తవణంపల్లె, జులై 11 ప్రభాతవార:** మండలంలోని వెంగంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వివాదాస్పద స్థలాన్ని చిత్తూరు డీఆర్ఓ పుల్లయ్య గురువారం పరిశీలించారు. వెంగంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన దొరస్వామిరెడ్డి అనే వ్యక్తి సుమారు 30 సెంట్లు భూమిని విరాళంగా అందజేశారు. అయితే తాను పాఠశాలకు విరాళంగా అందించిన భూమిని పాఠశాలకు స్వాధీనం చేయకుండా తానే అనుభవిస్తుండగా స్థలం విషయమై వివాదం నెలకొంది. ఈనేపథ్యంలో సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు చిత్తూరు డీఆర్ఓ పుల్లయ్య స్థానిక తహశీల్దార్ అరుణకుమారితో కలసి వివాదాస్పద భూమిని పరిశీలించారు. అయితే ఈభూమికి ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించాలని దొరస్వామిరెడ్డి డీఆర్ఓ పుల్లయ్య దృష్టికి తీసుకురావడంతో ప్రత్యామ్నాయ భూమిని కేటాయిం చేందుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రభుత్వ ప్రజా ఫిర్యాదుల వ్యవస్థకు వందనం!

**చౌడేపల్లి, జులై 11 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు అంబేద్కర్ భవన వ్యవస్థాపక అధ్యక్షుడు బ్యాంకు రెడ్డెప్ప కృతజ్ఞతలు తెలిపాడు. ఆయన కథనం మేరకు...చౌడేపల్లి పరిధిలోని దొరబావితోటకు సమీపంలో అంబేద్కర్ భవనాన్ని నిర్మించారు. ఆ భవనానికి ఎదురుగా రోడ్డుకడ్డంగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసారు. ఈ విషయమై ఈనెల 8న చిత్తూరులోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో తాను ఫిర్యాదు చేశానన్నారు. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని వేరొక చోటకు మార్చారన్నారు. ఫిర్యాదు చేసిన 3రోజుల్లోనే తన సమస్యను పరిష్కరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

## బొలేరో వాహనం బోల్తా...తప్పిన ప్రమాదం



**చౌడేపల్లి, జులై 11 ప్రభాతవార్త:** బొలేరో వాహనం బోల్తా పడి ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా బయటపడిన సంఘటన గురువారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని ఆమినిగుంట పంచాయతీ బూరగపల్లికి చెందిన హనుమంతు తన బొలేరోలో టమోటాలు కల్గిన బాక్సులను పలమనేరు మార్కెట్‌కు తరలించే నిమిత్తం బయలుదేరాడు. మార్గ మధ్యలోని ఆమినిగుంట స్టేజీవద్దకు రాగానే వాహనం వెనుకవైపునున్న ఆక్సిల్‌రాడ్ తెగిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది.

## జనాభా నియంత్రణపై అవగాహనా ర్యాలీ



**చౌడేపల్లి, జులై 11 ప్రభాతవార్త :** జనాభా నియంత్రణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ జరిగింది. బాల్యవివాహాల వల్ల కల్గే అనర్థాలు, మాతాశిశు సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. వైద్యాధి. కారిణి పూజ, సూపర్‌వైజర్ బాహుద్దీన్, జమున, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

**రొంపిచర్లలో :** వైద్యాధికారులు దినేష్‌కుమార్ నాయక్, వినయ్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ జరిగింది. తల్లీ, బిడ్డల శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డ, బిడ్డకు అంతరం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది కాంతమ్మ, పంకజ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## లార్వా నిర్మూలనకు గాంబూసియా చేపల పెంపకం

**చౌడేపల్లి, జులై 11 ప్రభాతవార్త :** అంటువ్యాధి కారకాలు దోమల లార్వాను నిర్మూలనకు గాంబూసియా చేప పిల్లలను విడచి పెట్టినట్లు వైద్యాధికారి పూజ అన్నారు. పట్టణంలోని నేతాజీనగర్, శివాలయం తదితర ప్రాంతాల్లోని పుష్కరిణి, మంచినీటి బావుల్లో వ్యాధికారక దోమల లార్వాల నిర్మూలనకు చేపలను విడచి పెట్టారు. సూపర్‌వైజర్ బాహుద్దీన్, జమున, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఎర్రేపల్లె సర్పంచ్ దుర్మరణం

**కాణిపాకం, జులై 11 ప్రభాతవార్త:** చిత్తూరు-ఐరాల రహదారిలోని 45 కొత్తపల్లె వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐరాల మండలం ఎర్రేపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ తులసిప్రసాద్‌రెడ్డి దుర్మరణం పాలయ్యారు. సంఘటనకు సంభంధించి కాణిపాకం ఎస్సై రామ్మోహన్ కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఎర్రేపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా వున్న తులసి ప్రసాద్‌రెడ్డి(48) తన సొంత పనుల నిమిత్తం బుధవారం చిత్తూరు వెళ్ళి రాత్రి 10.30 గంటలకు మోటారు సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యారు.ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ 45 కొత్తపల్లె వద్ద అదుపుతప్పడంతో రోడ్డు పక్కనున్న విద్యుత్ స్థంభాన్ని వేగంగా వెళ్ళి ఢీకొన్నాడు. దీనితో అతను తీవ్రగాయాలకు గురై అక్కడే పడిపోయాడు. చిత్తూరు నుండి బయలు దేరిన వ్యక్తి ఎంతకూ ఇంటికి రాకపోవడంతో తులసి ప్రసాద్‌రెడ్డి సెల్‌ఫోన్‌కు భార్య కాల్ చేశారు. ఫోన్ స్విచాఫ్ రావడంతో కుటుంబసభ్యులు వెతుక్కుంటూ రాగా 45 కొత్తపల్లె వద్ద తులసి ప్రసాద్‌రెడ్డి తీవ్రగాయాలతో రోడ్డు పక్కన పడివుండడాన్ని గుర్తించి వెంటనే చికిత్స నిమిత్త చీలాపల్లె సీఎంసీ అస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే తులసి ప్రసాద్‌రెడ్డి మృతి చెందినట్లు వైద్యులు దృవీకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

## మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శిగా చంద్రశేఖర్

**చిత్తూరు, జులై 11 ప్రభాతవార్త:** ఎపి పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ చిత్తూరు తాలుకా కార్యదర్శిగా గుడిపాల పిహెచ్‌సి హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్ నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



**సూళ్లూరుపేట, జులై 11 ప్రభాతవార్త** సూళ్లూరుపేటలోని లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్ నూతన కార్యవర్గం గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. రీజియన్ ఛైర్మన్ ఆర్‌వి రావు పాల్గొని నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా మధు సూదన్‌రెడ్డి, కార్యదర్శిగా రాధాకృష్ణరావు, కోశాధికారిగా అప్పా రావు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు ఆదిశేషారెడ్డి, శ్రీనివాసజెట్టిపాల్గొన్నారు.

## ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

వెంకటగిరి, జులై 11 ప్రభాతవార్త:



ఏపీఎస్ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వెంకటగిరి వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వెంకటగిరి డిపో గౌరవ అధ్యక్షుడు, మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వర రావు విభాగంలో ఎంప్లాయిస్ యూనియన్ జెండా ఆవిష్కరించి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో ప్రారంభమైన తర్వాత డిపార్ట్మెంట్లలోని కార్మికులు సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏపీఎస్ఆర్‌టిసీ ఎంప్లాయిస్ యూనియన్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి డిపో కార్యదర్శి వైవి ప్రసాద్, అధ్యక్షులు రాజగోపాల్, జాయింట్ సెక్రటరీ రమేష్, ట్రజరీ తారకేశ్వర్, మోహన్ కిరణ్, డిపో నాయకులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## అవినీతిపై చర్యలు తీసుకోవాలి

వెంకటగిరి, జులై 11 ప్రభాతవార్త :



దక్కిలి మండలంలో వెలుగు కార్యాలయంలో జరిగిన అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకో వాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్య క్షుడు గద్దల మునయ్య వినతి పత్రం అందజే శారు. దక్కిలి మండల వెలుగు కార్యాల యంలో 2016 నుండి 2023 వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలపై డిఆర్‌డిఏ అధికారులు విచారణ పూర్తయినప్పటికీ అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. అవినీతికి పాల్పడిన బాధ్యల పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకి వినతిపత్రంఇవ్వడంజరిగింది. ప్రజా సంఘాల ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షులు ఎన్‌కె రఫీ,పాల్గొన్నారు.

## రాజ్‌పై దాడి తీవ్రంగా ఖండిస్తున్నా : ఎంపీ

వెంకటగిరి, జులై 11 ప్రభాతవార్త :



టిడిపి నేతల దాడిలో గాయపడి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్త తంగా పేచీ రాజ్‌ని ఎంపి మద్దెల గురుమూర్తి పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇలాంటి దాడులు ఎవరూ ప్రోత్సహించరాదని ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడుస్తున్నా కూడా అభివృద్ధి, ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై ఇలాంటి దాడులు చేయడం మంచి పద్ధతి కాదనిఅన్నారు.ఆయనవెంట వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెంబర్లపూడి సురేష్ రెడ్డి ఉన్నారు.

## జనాభా నియంత్రణతోనే దేశం అభివృద్ధి

**కోట, జులై 11 ప్రభాతవార్త :** జనాభా నియంత్రణతోనే దేశం అభివృద్ధి, కుటుంబ ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. గురువారం ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటలోని బిసి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జనాభ పెరిగితే కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రోనో కార్పస్ మొక్కలు తొలగించాలి

గూడూరు, జులై 11 ప్రభాతవార్త :



పర్యావరణ పరిరక్షణ కోసం, ప్రజల ఆరోగ్యం కోసం పట్టణ పరిధిలో డివైడర్ల మధ్యలో ఉన్న క్రోనో కార్పస్ మొక్కలు తొలగించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కోరారు. క్రోనో కార్పస్ మొక్కల్ని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన కమిషనర్ వెంకటేశ్వర్లు త్వరలోనే మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, యనమల విజయ్, ఎంట్రపాటి సుమన్, దగర హరి తదితరులు ఉన్నారు.

## పాదయాత్రకు గూడూరులో ఘన స్వాగతం

గూడూరు, జులై 11 ప్రభాతవార్త :



బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు సిఎం అయినందున తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనార్థం కాలినడకన పోతున్నారు. గూడూరు - వెంకటగిరి పోయే బైపాస్ రోడ్డులో గూడూరు పట్టణానికి చెందిన టిడిపి నాయకుడు మాముదూరు హరికృష్ణ వారికి త్రాగు నీరు, అల్పాహారాన్ని అందచేశారు. సేవా కార్యక్రమాల్లో గూడూరు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య!

గూడూరు, జులై 11 ప్రభాతవార్త :



గూడూరు పురపాలక పరిధిలోని గాంధీనగర్ ప్రాంతం వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు కోట పట్టణానికి చెందిన నవకోటి సందీప్ (31) మనస్థాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి ఎస్ఐ హుటాహుటిన చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, 108 వాహనం ద్వారా గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కార్తీక్ కుటుంబానికి ఆర్థిక సహాయం

కోట, జులై 11 ప్రభాతవార్త :



కోటలో దళితవాడకు చెందిన ఇంగిలాల కార్తీక్ ఇటీవల అకాలమరణం చెందారు. నిస్సహాయులైన ఆ కుటుంబానికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం తెలుగుదేశం పార్టీ జిల్లా బిసిసెల్ అధ్యక్షుడు తీగల సురేష్‌బాబు తన సొంత డబ్బులు రూ.5 వేలు కార్తీక్ కుటుంబానికి అందజేశారు. కార్తీక్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీసెల్ సెక్రటరి పంట్రంగం వసంత్, టిడిపి అధ్యక్షుడు మర్రి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రికి మహర్దశ : ఎమ్మెల్యే



***సూళ్లూరుపేట, జులై 11 ప్రభాతవార్త:*** సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి మహర్దశ తీసుకొచ్చేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు ఉపయోగపడేలా నూతన భవనాలు నాబార్డు సహకారంతో ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్నాయని, వీటన్నింటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు, ఎఎన్ఎంలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్, నెలవల రాజేష్, ఇవి సురేష్, ఎజి కిషోర్, మాధవనాయుడు, మేడా సాయినారాయణ, పెంచలయ్య, శ్రీనివాసరావు, శ్రీధర్, వేమసాని శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్స్ అసోసియేషన్ స్టోర్స్ ప్రారంభం



**సూళ్లూరుపేట, జులై 11 ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేసన్ తోడ్పాటు అందించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా మార్కెట్లో ఉన్న ధరల కన్నా తగ్గింపు ధరలకు బియ్యం, కందిపప్పు ఇచ్చేందుకు సంసిద్ధమైంది. గురువారం ఇందుకు సంబంధించిన స్టోర్స్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ లాంఛనంగా ప్రారంభించారు. మేలురకం కందిపప్పు బహిరంగ మార్కెట్లో కిలో రూ.190 ఉండగా, దాన్ని రూ.160కు, స్టీమ్ రైస్ కిలో రూ.55 ఉండగా, దాన్ని రూ.45కు ఇచ్చేందుకు రైస్ మిల్లర్లు ముందుకొచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మిల్లర్స్ అసోసియేషన్ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్, మేడా సాయినారాయణ, ఏజీ కిషోర్, బండారు ఆంజనేయులు, అలవల శ్రీనివాసరావు, తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అక్కాలమ్మ జాతర కరపత్రాలు ఆవిష్కరణ

**సూళ్లూరుపేట, జులై 11 ప్రభాతవార్త:** సూళ్లూరుపేట మండల పరిధిలోని దామరాయి పంచాయతీ కొల్లపట్టు గ్రామదేవత అయిన అక్కాలమ్మ జాతరకు సంబంధించి కరపత్రాలను గురువారం టిడిపి నేతలు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ జాతర ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణమ్మ, తిరుపాల్, శేఖర్, జానకిరామయ్య, వరాలుబాబు, అక్కులయ్య, మేడా సాయినారాయణ, పెంచలయ్య, పామూరు మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పియం కిసాన్‌ని సద్వినియోగం చేసుకోండి : ఎడి

**దొరవారిసత్రం జులై 11 ప్రభాతవార్త;** ప్రధానమంత్రి కిసాన్ సమ్మన్ నిదిని రైతులు అందరు కలిసి సద్వినియోగం చేసుకోవాలని సూళ్ళూరుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం దొరవారిసత్రం వ్యవసాయశాఖ కార్యాలయంలో పియం కిసాన్ ప్రత్యేక పరిష్కరవేదిక కార్యక్రమం నిర్వహించారు.మండలంలో రైతులు సుమారు 120 మంది వచ్చి వారిసమస్యలు తెలుసుకొని పరిష్కరించుకోవడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఇంకా ఎవరనై రైతులకు సమస్యలు ఉన్నట్లతే తమను సంప్రదించి సమస్యలు పరిష్కరించుకొని అందరు రైతులు పియం కిసాన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈకార్యక్రమంలో ఎవొ జోతిర్మయి, వీఎఎలు, ఎమ్‌పిఈఓలు,రైతులు పాల్గొన్నారు.

## గూడూరు వద్ద రేషన్ బియ్యం పట్టివేత



గూడూరు, జులై 11, ప్రభాతవార్త : గూడూరు రూరల్ మండల పరిధిలో ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల వద్ద గురువారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. తడ నుంచి కావలికి మినీ లారీలో సుమారు 250 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఇంటర్ విద్యార్థులకు 15లోపు ఉచిత పాఠ్య పుస్తకాలు

కోట, జులై 11 ప్రభాతవార్త:

ఇంటర్మీడియట్ విద్యార్థులు ఐదేళ్లపాటు పాఠ్య పుస్తకాలు లేకుండా చదువులు కొనసాగించారు. పాత పుస్తకాలు, అధ్యాపకులు చెప్పే రాత పుస్తకాలతోనే చదువు పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఏటా ఇంటర్ ఫలితాల శాతం తగ్గిపోయింది. నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేస్తామని చెప్పడంతో విద్యార్థుల్లో ఉత్సాహం నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సోషల్ ట్రైబల్ వెల్ఫేర్ హైస్కూల్ ప్లస్ విద్యార్థులు మేలు కలగనుంది. ఇంటర్ విద్యార్థులకు మంచిరోజులు రానున్నాయి. ఈ నెల 15 నాటికి ఆయా కళాశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేయనున్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**నాయుడుపేట, జులై 11 ప్రభాతవార్త :** ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని నాయుడుపేట ఎఎంసి మాజీ ఛైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేట పట్టణంలో నారాయణ హైస్కూల్ వారు గురువారం చేపట్టిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పూర్వీకులు అందించిన స్వచ్ఛమైన నీరు, గాలి, నేలను యధావిధిగా ముందు తరాలకు అందించాల న్నారు. పరిశుభ్రత, పచనచదనంతో కూడిన ఆరోగ్యవంతమైన సమాజం కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. నారాయణ హైస్కూల్ ఎజిఎం గురవయ్య మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతులన్నీ ప్రకృతిని ఆరాధిస్తూ, చెట్లు, నదులు పర్వతాలను గతంలో పూజించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ రియాజ్, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఏవో షేక్ గౌస్‌బాషా, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాడ వాడల్లో బృందమ్మ జన్మదిన వేడుకలు



**శ్రీకాళహస్తి, జూలై 11 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తిలోని వాడ వాడల్లో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి, ప్రస్తుత శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. వాడ వాడల్లో సామాజిక కార్యక్రమాలను, అన్నదానాలను ఏర్పాటు చేసారు. కొత్తపేటలోని కార్గిల్ సర్కిల్‌లో యువ తెలుగుదేశం నాయకుడు జావిద్ సారథ్యంలో భారీ ఎత్తున అన్నదానం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా రిషితా రెడ్డి హాజరయ్యారు. గురువారం ఉదయం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆమెకు పాదాభివందనం చేసి ఆశీర్వచనాలు అందుకున్నారు. అలాగే ఊరందూరు గ్రామానికి కార్యకర్తలు బారులు తీరారు. జన్మదిన శుభాకాంక్షలు తెలపటానికి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు కదలి వచ్చారు. కాగా పట్టణంలోని కార్గిల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలకు తెలుగుదేశం నాయకులు మాజీ కౌన్సిలర్ గిరిధర్, మస్తాన్, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు. కాగా సుబ్రమణ్యం స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో కాసరం రమేష్, వివేక్ గౌడ్, మండల సుబ్రమణ్యం, వాకచర్ల గుర్రప్పశెట్టి, డివి నారాయణ, ఢిల్లిబాబు, షేక్ జిలాని, వజ్రం కిషోర్, కటికం సుబ్రమణ్యం, పట్టణ మహిళా అధ్యక్షురాలు సుమతి, మాధవ, కంఠా సుబ్రమణ్యం, మణి, ఊహా, జయశ్రీ, ఈశ్వరి, దివ్య, నీలూ, శ్రీనివాసులు, రాకేష్, శరవణ కుమార్, మహేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు. కాగా తెలుగుయువత నాయకుడు వంకాయల సిద్దులయ్య, ఎస్‌టి సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య తదితరుల శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని అంబలిస్వామి ఆశ్రమంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు.

## ప్రతి సోమవారం అందుబాటులో ఉంటా!

**శ్రీకాళహస్తి, జూలై 11ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి ప్రజల సమస్యలను పరిష్కరిం చుటకు తెలుసుకొనుటకు తాను ప్రతి సోమవారం పంచాయతీరాజ్ అతిథి గృహంలో అందుబాటులో ఉంటానని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుటకు గోపాలకృష్ణారెడ్డి పాలనను అందించుటకు కృషి చేస్తున్నానని ప్రజలు సహకరించాలన్నారు. ఉదయం 9గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటామని వివరించారు.

## మా బాబు కనబడటం లేదు!



**శ్రీకాళహస్తి, జూలై 11 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి పట్టణంలోని సన్నిధివీధిలోని టూరిస్టు బస్టాండు సమీపంలో నివాసముంటున్న పద్మమ్మ తెలిపారు. వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆ తల్లి వాపోతుంది. బతుకు జీవనం కోసం టూరిస్టు బస్టాండు ఎదురుగా అల్పాహారం షాపు నిర్వహించు కుంటూ జీవనం గడుపుతున్నామన్నారు. తనకు ముగ్గురు కుమారులున్నారని వారిలో మూడవ వాడు ఎం.గోపి(14) అని పద్మమ్మ వివరించారు. గత నెల 12న ఉదయం నుంచి కనబడటం లేదన్నారు. ఆతని కోసం వెతకని చోటు లేదన్నారు. గత నెలే తాము వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. ఫోటోలోని గోపి ఎవరికైనా కనబడితే చరవాణి నెంబర్లు 8885927940 లేదా 9705273331కు సమాచారం ఇవ్వాలని పద్మమ్మ కోరారు.

## ఊరందూరులో బృందమ్మ జన్మదిన వేడుక సంబరాలు



**శ్రీకాళహస్తిరూరల్, జూలై 11 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి స్వగ్రామంలో గురువారం ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మ జన్మదినం సందర్భంగా సంబరాలు చోటు చేసుకున్నాయి. తెలుగుదేశం నియోజకవర్గంలోని మహిళలు గురువారం పొద్దుపొడవక ముందే ఊరందూరు గ్రామానికి చేరుకొని బృందమ్మను దుశ్శాలువలతో సత్కరించారు. పూల మాలలతో ముంచెత్తారు. గ్రామంలో భారీ ఎత్తున కేక్‌ను ఏర్పాటు చేసి కట్ చేయించారు. ఈ కార్యక్రమాలను మాజీ పార్టీ అధ్యక్షురాలు బూడిదవాకం రేణుకమ్మ, మాజీ శ్రీకాళహస్తి మండలాధ్యక్షురాలు వాణి నియోజకవర్గంలోని మహిళలు హాజరయ్యారు. పెద్ద కేక్‌ను తెచ్చి కట్ చేసారుబొజ్జల రిషితారెడ్డి హాజరయ్యారు.

## విద్యుత్‌స్టార్టర్ల చోరీ-రైతుల లబోదిబో



**తొట్టంబేడు, జూలై 11 ప్రభాతవార్త :** అన్నదాతలు సాగుకోసం మోటార్ల ద్వారా పంటలు సాగుచేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో పొయ్య గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పంట పొలాల్లో సుమారు 25మందికి రైతులకు చెందిన 34 స్టార్టర్లు, కేబుల్ వైర్లుచోరీకి గురయ్యాయి. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో రైతులకు చెందిన స్టార్టర్లును పగులగొట్టి కేబుల్ వైర్లను తీసుకుని పంటకాలువ పక్కనే పడేశారు. ఉదయం రైతులు పంటపొలాల వద్దకు చేరుకోగానే తమ పొలాలకు చెందిన విద్యుత్‌స్టార్టర్లు చోరీకి గురైన విషయం తెలుసుకుని తొట్టంబేడు ఎస్‌ఐకు సమాచారం అందించారు. దీంతో ఆయన అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ రాఘవేంద్ర మాట్లాడుతూ స్టార్టర్ల చోరీకి సంబందించి తమకు ఎలాంటి పిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



**శ్రీకాళహస్తిరూరల్, జూలై 11 ప్రభాతవార్త :** నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు పాఠశాలకు తరచుగా గైర్హాజరవుతున్న విద్యార్థులను పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడడం జరిగింది. ఇప్పటి వరకు పాఠశాలకు రాకపోవడానికి గల కారణాలను అండగా వివిధ కారణాలు తెలిపడంతో ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రస్తుతం తల్లికి వందనం కింద రూ.15వేలు గురించి పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ మౌళిక సదుపాయాలు గురించి తల్లిదండ్రులకు వివరించారు. నేటి నుంచి పాఠశాలకు హాజరయ్యే విధంగా కృషిచేయాలని తల్లిదండ్రులుగా బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తొండమనాడు సిఆర్‌పి ప్రదీప్‌కుమార్, బివిపురం సిఆర్‌పి ప్రసాద్, ఎన్‌జిఓ రామచంద్రయ్య ప్రగతి ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబును కలసిన శాంతారాం



**కుప్పం, జూలై 11 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడును రాష్ట్ర నాయీబ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ వైద్యం శాంతారాం కలిశారు. సచివాల యంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సిఎంను కలసిన శాంతారాం నాయీ బ్రాహ్మణుల సమస్యలను సిఎంకు వివరిం చారు. సమస్యలపై స్పందించిన సిఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈసందర్భంగా సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కలెక్టర్‌చే స్థల పరిశీలన



**కుప్పంరూరల్, జూలై 11 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు సంబంధించి గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్థల పరిశీలన చేశారు. ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌తో కలసి మండలంలోని కృష్ణదాసనపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ భూములను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో కుప్పం ఇన్‌చార్జ్ పిఏస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఆర్డీఓ శ్రీనివాసులు, తహశీల్దార్ హరికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, మంజు, మహేంద్ర, నరేష్, వాసు, శివశంకర్, మణి, ఉమాపతి, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



**కుప్పంరూరల్, జూలై 11 ప్రభాతవార్త :** మండలంలోని రాగిమానుమిట్ట ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఉర్దూ విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఉచిత విద్యాసామగ్రిని తెదేపా జిల్లా నేత రాజగోపాల్, సీనియర్ నేత శివకుమార్ తదితరులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థు లు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మైనార్టీ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్యలో నాసా విద్యార్థులకు బహుమతి ప్రధానం

**తిరుపతి విద్య, జూలై 11 ప్రభాతవార్త :**



స్థానిక న్యూ ఇందిరానగర్ శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ స్థాయిలో గెలుపొందిన నాసా విజేతలకు గురువారం ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శ్రీ చైతన్య పాఠశాల ఎజిఎం సురేష్ విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, మానవ మనుగడ అత్యంత అవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీవాణి, జోనల్ కోఆర్డినేటర్ ఏ బాలాజీ, జోనల్ డీన్ కాశీరావు, ఐకాన్ ఇన్చార్జి త్రిలోక్, సి బ్యాచ్ ఇన్చార్జి లోకేష్, ఎస్. బ్యాచ్ ఇన్చార్జి ఆమని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డా. వంశీకృష్ణకు యంగ్ పీడియాట్రిషన్ అవార్డు



**తిరుపతి హెల్త్, జూలై 11 ప్రభాతవార్త :** తిరుపతికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఏ. వంశీకృష్ణకు యంగ్ పీడియాట్రిషన్ అవార్డును అందుకున్నారు. అంకుర మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఏ. వంశీకృష్ణ అందిస్తున్న వైద్య సేవలను గుర్తించిన ఏసియా టుడే మీడియా సంస్థ యంగ్ పీడియాట్రిషన్ ఆఫ్ ది ఇయర్ ఆంధ్రప్రదేశ్ అవార్డుతో పాటు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు అందజేశారు. గురువారం బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డులను అందుకున్నారు. సందర్భంగా పలువురు డాక్టర్ వంశీకృష్ణను అభినందించారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేతకు చర్యలు

**చంద్రగిరి, జూలై 11 ప్రభాతవార్త:** విద్యుత్ సరఫరాలో లోపాలను సరిదిద్దేందుకు మండల పరిధిలోని కొన్ని పంచాయతీలలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడిఈ శేషాద్రిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని నరశింగాపురం, నాగయ్యగారిపల్లి, కూచివారిపల్లి, బుచ్చి నాయుడు పల్లి, శంకరయ్యగారి పల్లి, పుల్లయ్యగారిపల్లి, బందార్లపల్లి, కొటాల, ఏ.రంగంపేట, నారావారిపల్లి, కందులవారిపల్లి, శేషాపురం, చిన్న రామాపురం, భీమవరం, యల్లంపల్లి గ్రామాలలో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో నిర్వహణ మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ట్రిపుల్ ఐటికి నెత్తకుప్పం విద్యార్థులు



**రామచంద్రాపురం, జూలై 11 ప్రభాతవార్త:** కడప జిల్లా, ఇడుపులపాయి ట్రిపుల్ ఐటికి నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తులసికుమారి తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిని ట్రిపుల్ ఐటికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. వీరి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, పేరెంట్స్ హర్షం వ్యక్తం చేశారు.

## శ్వేతవారాహి దేవి అలంకారంలో అమ్మవారు

**రామచంద్రాపురం, జూలై 11ప్రభాతవార్త:**



వారాహీ దేవినవరాత్రి ఉత్సవాలు రామచంద్రాపురంమండలం రాయల చెరువు కట్టపై ఉన్న శ్రీశక్తిపీఠంలో వేడుకగా జరుగుతున్నాయి. ఆరవరోజు గురువారం ఉదయం అమ్మవారికి శక్తిపీఠం వ్యవస్థాపకుడు సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి దివ్య ఆశీస్సులతో శక్తిపీఠాధీశ్వరి, మాతృశ్రీ రమ్యానంద భారతి స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుగందపరిమళ భరిత ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిఅమ్మవారికి దర్బార్ నిర్వహించారు. పట్టువస్త్రాలు, వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.

## ప్రజలకు త్రాగునీటి పైప్ లైన్ నిర్మాణానికి పూజ

**పాకాల, జూలై 11 ప్రభాతవార్త :**



పాకాల మండలం పాకాల పంచాయతీ పరిధిలోని ప్రజలకు తాగునీటి సమస్యని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం పరిష్కరించారు. పొగతోటలో ఉన్న నూతన బోరు నుండి రెండు కిలోమీటర్ల మేర పైపు లైన్ నిర్మాణానికి టిడిపి నాయకులు, మహిళా నాయకురాళ్లు, కుటుంబ సభ్యులు కలిసి పూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మహిళా నాయకురాలు, కుటుంబ సభ్యులు కలిసి పూజ నిర్వహించి ప్రారంభించారు.

## 13న బహిరంగ వేలం

**పాకాల, జూలై 11 ప్రభాతవార్త :** ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లె గ్రామం ఆనందగిరి పర్వతం పై కొలువున్న శ్రీ వల్లి దేవ సేన సమేత సుబ్రమణ్య స్వామి దేవాలయంలో ఈ నెల 27వ తేది నుంచి 31వ తేది ఆదికృత్తిక ఉత్సవంకు గాను 13వ తేది శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి యువరాణి పేర్కొన్నారు.

## బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించండి : ఎంఈవో



**నగరి, జూలై 11 ప్రభాతవార్త:** వెనుకబడిన విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించాలని ఎంఈవో శ్రీదేవి అన్నారు. గురువారం నగరి పేట ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల నైపుణ్యతను పరిశీలించారు. ఆంగ్లంలో 80 శాతం విద్యార్థులు బాగా తర్ఫీదు పొంది ఉండడంతో వారిని అభినందించారు. వెనుక బడిన విద్యార్థులను ప్రత్యేక తర్ఫీదును ఇచ్చి బేస్‌లైన్ టెస్టులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## తక్కువ ధరకే బియ్యం, పప్పు



**నగరి, జూలై 11 ప్రభాతవార్త:** వినియోగదారులకు మర్చంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు అందిస్తున్నట్లు ఆర్డీవో వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం తక్కువ ధరకు సరకులను విక్రయించేందుకు మర్చంట్స్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ బియ్యం రూ.48, స్టీమ్డ్ బియ్యం రూ.49, కందిపప్పు రూ.160లకే అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శంకరన్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, నగరి మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు భూపతినాయుడు, కార్యదర్శి రవి, ఉప కార్యదర్శులు నాగరాజు, మురళి పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో ఉత్తరానక్షత్ర పూజలు

**నగరి, జూలై 11 ప్రభాతవార్త:** పట్టణ పరిధి బైపాస్‌కూడలి సమీపం శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరానక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్‌బాబు, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థిని

**విజయపురం, జూలై 11 ప్రభాతవార్త:**



మండలంలోని జంబాడ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటికి విద్యార్థిని దాక్షాయణి ఎంపికైంది. ఎంపికైన విద్యార్థినిని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. పలువురు విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదుల



**విజయపురం, జూలై 11 ప్రభాతవార్త:** స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విడుదల చేయడంపై ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్ గురువారం మండల కేంద్రమైన విజయపురంలో హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలో వచ్చిన కొన్ని రోజుల్లోనే పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేయడానికి వినూత్న మార్పులు తీసుకొస్తున్నారని, ఇక గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

## పుడమితల్లిని కాపాడుదాం!



**చంద్రగిరి, జూలై 11 ప్రభాతవార్త:** పుడమితల్లిని కాపాడుదాం, పుట్టిన బిడ్డలకు భవిష్యత్తునిద్దామని రుయా చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ మునిమోహన్ అన్నారు. స్థానిక ఆర్‌హెచ్‌టిసిలో గురువారం మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శశికళ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి బిడ్డ ఆరోగ్యంగా జీవించడం కోసం కాన్పుల నడుమ కనీసం మూడు సంవత్సరాలు వ్యవధి తీసుకోవాలన్నారు. డాక్టర్ సౌమ్యప్రియ, డాక్టర్ రేవతి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎం టాటాబాయి, సూపర్‌వైజర్ ప్రమీల, నారాయణ రాజు, ఏఎన్‌ఎంలు సుబ్బలక్ష్మి, గిరిజ, శశిరేఖ, తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : ఎంఎల్ఏ



**శ్రీకాళహస్తిరూరల్ జూలై 11 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని ప్రభుత్వ వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్వగృహంలో తిరుపతి జిల్లా బిసి సంక్షేమశాఖాధికారి ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహాల సమస్యల పై అధికారులతో చర్చించారు. శ్రీకాళహస్తి వసతి గృహాల నిర్వహణలపై విమర్శలు న్నాయని అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో గల సమీకృత వసతి గృహం తాను పరిశీలించానని అక్కడ వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించానన్నారు. ఈ వసతి గృహంలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాడానికి ఒక పరిశ్రమ నిర్వాహకులతో చర్చించానన్నారు. వార్డెన్లు కూడా తనకు సహకరించాలన్నారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే తాను పరిష్కరిస్తానన్నారు. వార్డెన్లు రామయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ట్రిబుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపిక



**వడమాలపేట, జూలై 11 ప్రభాతవార్త:** వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అంజే రప్ప, తరుణ్, హేమలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపా ధ్యాయులు కరుణ నవనీతం తెలిపారు. 573 మార్కులు సాధించిన తరుణ్ నూజివీడు ఐటీకి, అంజే రప్ప, హేమలు ఇడుపులపాయలో సీట్లను కేటాయించారు. ఐటీకి ఎంపికైన విద్యార్థులను ప్రధానో పాధ్యాయులు కరుణ నవనీత, మండల విద్యాశాఖ అధికారులు పద్మావతమ్మ, తులసిరామ్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## భక్తుల స్వహస్తాలతో సాయిబాబాకు క్షీరాభిషేకం



**పుత్తూరురూరల్, జూలై 11 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని టీబీ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో భక్తి ప్రవర్తలతో బాబాకు క్షీరాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువ జామున 2.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేకమైన క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆ క్యూలైన్ ద్వారా భక్తులు స్వహస్తాలతో అభిషేకకార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ప్రత్యేక సాంస్కృతిక నిర్వహించారు. భక్తులు స్వామి వారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపిన సైకం



**తిరుపతిరూరల్, జూలై 11 ప్రభాతవార్త:** నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌రెడ్డికి సివిల్ సప్లయ్ మాజీ ఛైర్మెన్ సైకం జయ చంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలియజేసారు. గురువారం పద్మావతి పురంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను సైకం జయచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. దివంగత మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు నగరి ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసారు.

## రాపిడ్ ఆటో కెప్టెన్‌కు బహుమతి ప్రదానం

**తిరుపతిసిటీ, జూలై 11 ప్రభాతవార్త:**



రాపిడో ప్లాట్‌ఫారమ్ ద్వారా ఆదావనరులను పెంచడంతో ఉత్త సేవలు అందిస్తున్న రాపిడ్ ఆటో కెప్టన్స్ ప్రకటించి అందజేశారు. స్థానిక ర్యాపిడో సంస్థ కార్యాలయంలో గురువారం బహుమతులు ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరై ప్లాట్ ఫారమ్ ద్వారా ఆదాయాలను పెంచిన రాపిడ్ ఆటో కెప్టన్స్ మురళీకృష్ణ, శ్రీనివాస్, రామారావు, మహేంద్ర, రమేష్, వెంకటేష్, సునీల్, కుళ్లాయిస్వామి, లవకుమార్, బాలాంజనేయులు, సురేష్‌లకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ర్యాపిడో సంస్థ జోనల్ మేనేజర్ శ్రీనివాస రామగిరి, కస్టర్ మేనేజర్ చంద్రశేఖర్, విస్తరణ మేనేజర్ రాజీవ్, రాపిడో ఆటో కెప్టన్స్ పాల్గొన్నారు.

## 150 బైపాస్ రోడ్డులో చెత్త డంప్ చేస్తే రూ.10వేలు జరిమాన



**తిరుపతిరూరల్, జూలై 11 ప్రభాతవార్త:** తిరుపతి 150 బై పాస్‌లో చెత్త డంప్ చేస్తే రూ.10వేల రుపాయాల జరిమాన విధించాలని డిఎల్‌పివో రుపారాణి ఆదేశించారు. తిరుపతిజిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హై వే రోడ్డుకు ఇరువైపుల సమీప పంచాయతిల చెత్తను డంప్ చేస్తున్నారని, చెత్తను డంప్ చేయకుండా కట్టడి చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. 150 బైపాస్ రోడ్డుకు సమీప పంచాయతిలైన గాంధీపురం, అవిలాల, సాయినగర్, లింగేశ్వర్‌నగర్, వేదాంతపురం, ఓటేరు, శ్రీనివాసపురం గ్రామ పంచాయతిలలో ఉన్న చెత్తను బై రోడ్డుకు ఇరువైపుల డంప్ చేస్తున్నారని, డంఫ్ చేసేవారిని గుర్తించి రూ.10వేల రుపాయాల జరిమానా విధించాలని ఆదేశించారు. చెత్త డంప్ చేసే ప్రదేశాలలో 'ఇచ్చట చెత్త వేయరాదు' అనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇవో పిఆర్డీ గిరిధర్‌రెడ్డి, పంచాయతి కార్యధర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## రైల్వే ప్రయాణికుల సమస్యలు తీర్చండి

**– జిల్లా టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జ్యోతినాయుడు**

**నగరి, జూలై 11 ప్రభాతవార్త:** నగరి సమీపంలోని ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సమస్యలు తీర్చాలని చిత్తూరు జిల్లా టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జ్యోతినాయుడు కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ స్టేషన్ నుంచి వ్యాపార నిమిత్తం చెన్నై, తిరుపతి మార్గంలో వందల సంఖ్యలో ప్రయాణికులు వెళుతుంటారని, గత ప్రభుత్వం సౌకర్యాల విషయంలోపూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. కావున టీడీపీ ప్రభుత్వం తరపున సౌకర్యాలు కల్పిస్తే ప్రయాణికులకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. చెన్నైకి వెళ్ళడానికి గతంలో ఉన్న మెమో ట్రైన్‌ని మళ్లీ పునరుద్దరిం చాలని, దాదర్ ఎక్స్‌ప్రెస్‌ను ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ వద్ద ఆపాలని, కాచిగూడ ట్రైన్ వారంలో మూడు రోజులు మాత్రమే మా రైల్వే మార్గంలో పాండిచ్చేరి వైపుగా వెళుతుంది. మిగిలిన నాలుగు రోజులు చెంగల్‌పట్టు వరకే ఆగిపోతుంది. ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌కు సదుపాయాలు వీలైనంత త్వరగా కల్పించాలని ఆయన కోరారు. అనంతరం ఎంపీ దగ్గు మల్ల ప్రసాద్‌రావు, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌లకు ఏకాంబరకుప్పంలో రైల్వే సమస్యలు గురించి పూర్తి వివరాలతో వినతిపత్రం అందజేశారని ఆయన తెలిపారు.

## పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతుల ఎదురు చూపులు

**చిట్టమూరు, జూలై 11 ప్రభాతవార్త :**

చిట్టమూరు మండలంలోని ఆయా గ్రామాల రైతులు పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురుచూపులు చూడక తప్పడం లేదు. రబీ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే దుక్కులు దున్నుకొని సిద్ధంగా ఉన్న రైతులకు సబ్సిడీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల మండలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు ముందుగానే రైతులకు విక్రయించినప్పటికీ మండలంలో నేటికీ కార్య రూపం దాల్చకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సకాలంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## మంచినీటి సమస్యపై డిఎల్‌పిఓ ఆరా

**మల్లాం (చిట్టమూరు), జూలై 11 ప్రభాతవార్త :** చిట్టమూరు మండలం మల్లాం దళిత కాలనీలో నెలకొని ఉన్న మంచినీటి సమస్యపై గురువారం డిఎల్‌పిఓ వెంకటరమణ విచారణ చేపట్టారు. మల్లాం దళిత కాలనీకి చెందిన శంకరయ్య, సుబ్రహ్మణ్యంలు తమ గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యపై స్పందన ద్వారా తిరుపతి జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. ఈ క్రమంలో డిఎల్‌పిఓ వెంకటరమణ దళిత కాలనీకి చేరుకొని గ్రామస్థులను అడిగి తాగునీటి సమస్యపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏఇ ఆర్‌డబ్ల్యుఎస్ అరవింద్‌తో చర్చించి తాగునీటి సమస్య వెంటనే పరిష్కరించాలని సూచించారు. డిఎల్‌పిఓ వెంట ఇఓఆర్‌డి మనోహర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకులు



**రేణిగుంట, జూలై 11 ప్రభాతవార్త:** రేణిగుంట మండలంలోని ఆర్ అగ్రహారం, గుండ్రాల కాలువ ప్రాథమిక పాఠశాలలను విద్యా ప్రవేశంపై రాష్ట్ర పరిశీలకులు టి.బాలకృష్ణ, అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వి.మధు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యాబోధనను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సమకూరుస్తున్న అన్ని సౌకర్యాలు విద్యార్థులకు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. మధ్యాహ్న భోజన ప్రక్రియలను సమీక్షించారు. హాజరు శాతం పెరగాలని, డ్రాపౌట్ లేకుండా చూడాలని ఉపాధ్యాయులను, మండల అధికారులను ఆదేశించారు. పరిశీలకులతో పాటు మండల విద్యాధికారులు గంటా ఇందిరాదేవి, రంగనాథ్‌లు ఉన్నారు.

## ఎమ్మెల్యే ఆరణిని సన్మానించిన ఆర్కాట్



**తిరుపతి హెల్త్, జూలై 11 ప్రభాతవార్త :** తిరుపతి గాంధీ భవన్ వార్డులలో తన విజయానికి కష్టపడిన కూటమి నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞత సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, మాజీ శాసన సభ్యురాలు సుగుణమ్మ విచ్చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మ విచ్చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తన విజయం కోసం కష్టపడిన ప్రతి కార్యక ర్తను గుర్తు పెట్టుకుంటానని తెలిపారు. తిరుపతి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, బెల్లంకొండ సురేష్, చెరుకుల నీలాద్రి రాయల్, టిడిపినాయకులుఆముదాలతులసిరామ్, తోట జయంతి, గోపి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# నా గెలుపు ప్రజలకే అంకితం : ఎమ్మెల్యే పులివర్తి

తిరుపతిరూరల్, జూలై 11 ప్రభాతవార్త: చంద్రగిరి అభివృద్దే దృష్టి కేంద్రీకరించి... చంద్రగిరి నియోజక వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని... తన గెలుపును ప్రజలకు అంకితం చేస్తున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేసారు. కూటమిలో చిన్నచిన్న సమస్యలు తలెత్తిన ప్రతినెల సమావేశం నిర్వహించుకుని పరిష్కరించుకుంటామని చిత్తూరు ఎంపి. దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. గురువారం తిరుపతిరూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్‌లో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నేతలతో సమావేశమైనారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాని మీడియాతో మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని, ఎన్నికల హామీలను అమలు చేస్తామని తెలిపారు. చంద్రగిరికి స్మశానవాటిక, తిరుమల నడకదారి భక్తులకు వసతి సౌకర్యం, రాయలచెరువు రోడ్డుకు మరమ్మతులు, చెరువుకట్ట సమస్యలు, చిన్నగొట్టికల్లు, యర్రావారిపాళ్యం మండలాలకు నీటి సమస్య పరిష్కారం, తలకోన బ్యాక్ వాటర్‌ను చెరువులకు అనుసంధానం చేయడం, నేంద్రగుంట, పెనుమూరు డబుల్‌రోడ్డు వంటి అభివృద్ధి పనులు కోసం ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావుతో కలిసి ముందుకువెళతామని తెలిపారు. ప్రతిపక్ష నేత మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భద్రతకు అవసరమైతే తన గన్‌మెన్‌లను పంపుతానని తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలో వరదలకు కొట్టుకుపోయిన 3బ్రిడ్జిలకు రూ.53కోట్లు అవుతుందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. తనపల్లిలో ఓ రైస్‌మిల్లు నుండి డబ్బులు డిమాండ్ చేసినట్లు, ఓ కాంట్రాక్టర్ వద్ద 2ఎకరాలు స్థలం రాయించుకున్నానని ఆరోపణలు చేయడం బాధాకరం అన్నారు. 57కోట్ల రుపాయాలు విలువ చేసే మఠం భూమి కబ్జా చేసాననే నిరాధారమైన ఆరోపణలను కొట్టిపారేశాడు. చంద్రగిరిలో స్వంత ఇళ్ళు నిర్మించుని ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని తెలిపారు. కమీషన్లుకు కక్కుర్తి పడే సంస్కృతి తనది కాదని తెలిపారు. అనంతరం ప్రజల నుండి ఫిర్యాదులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ట్రిపుల్‌ఐటికి ఐదుమంది విద్యార్థుల ఎంపిక



శ్రీకాళహస్తిరూరల్, జూలై 11 ప్రభాతవార్త : మండలంలోని తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఐదుమంది ట్రిపుల్‌ఐటికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జి.కృష్ణయ్య తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 590/600 మార్కులతో శ్రీకాళహస్తి మండలంలోనే ప్రధమశ్రేణి ఉత్తీర్ణత సాధించి ట్రిపుల్‌ఐటిలో సీట్లు పొందిన యోగేష్, దేవి, అభిలాష్, అభిలాష్, మేఘనలను ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్యతో పాటు సహోపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మోహన్‌బాబు, కుప్పయ్య, భాస్కర్, వెంకటరత్నం, సుజాత, చంద్రకుమారిలతో పాటు సిఆర్‌పి ప్రదీప్‌లు అభినందించారు.

## నియోజకవర్గ సమావేశాన్ని జయప్రదం చేయండి



శ్రీకాళహస్తి, జూలై 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి రూరల్ మండలం సమితి సమావేశం స్థానిక కార్యాలయంలో తొండు మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ ఈనెల 15న పార్టీ కార్యాలయంలో జరిగే సిపిఐ నియోజకవర్గ సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరవ్వాలన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు భూబకాసురులు విచ్చలవిడిగా అక్రమించి స్థానికేతరులకు విక్రయిస్తున్నారని, అంతేకాకుండా ప్రభుత్వ భూములను కొల్లగొట్టడం వంటిపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీలు సాగుచేయడానికి సెంటు భూమి లేక పలు ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మించలశివకుమార్, నాయకులు రాజయ్య, మణి, శివ, సుబ్రమణ్యం, గాయత్రి, సాంబయ్య, భక్తవత్సలం, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సరసమైన ధరలకు సరుకుల : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూలై 11 ప్రభాతవార్త : ప్రజల కోసం నాణ్యమైన సరుకులు తక్కువ ధరలకే విక్రయించేందుకు ప్రభుత్వం స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం సాయిబాబా ఆశ్రమం దగ్గర నూతనంగా ప్రభుత్వ ఏర్పాటు చేసిన నాణ్యమైన బియ్యం ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పేదలకు ఈ స్టాక్ పాయింట్ ద్వారా ప్రతి కిలోకి పది రూపాయిలు తక్కువ ధరతో కందిపప్పు, బియ్యం వంటి సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాలా చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల సహకారంతో సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వరరావు, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి రామచంద్ర నాయుడు, తహశీల్దార్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాలు



గూడూరు, జూలై 11 ప్రభాతవార్త : నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణలో రైతు బజార్లలో ఒక కేజీ కందిపప్పు, 160 రూపాయిలు, స్టీమ్ బియ్యం కేజీ 49 రూపాయలు, మరొక రకం కేజీ 48 రూపాయల చొప్పున విక్రయించే విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం చేయడం జరిగిందని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని గూడూరు తహశీల్దార్ కరుణ్ కుమార్ ప్రజలకు విజ్ఞాప్తి చేశారు. గూడూరు పట్టణంలోని రైతు బజార్లో తిరుపతి జిల్లా రైస్ మిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్, హెల్ సేల్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ విక్రయ కేంద్రాన్ని గూడూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ హజ్మతుల్లా ఖాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు చెంచు రామయ్య, వాటంబేడు శివకుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ సూపర్ మార్కెట్‌లో కందిపప్పు, బియ్యం

**-ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎంఎల్ఏ పులివర్తి నాని**



చంద్రగిరి, జూలై 11 ప్రభాతవార్త: నిత్యవసర వస్తువుల ధరలు మండుతున్న వేళ స్వర్ణ సూపర్ మార్కెట్‌లో కందిపప్పు, బియ్యం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. స్థానిక ఆర్టీసి బస్టాండ్‌కు ఎదురుగా గల ఆదూరి నాగరాజ నాయుడుకు చెందిన స్వర్ణ సూపర్ మార్కెట్‌లో సాధారణ ప్రజలకు అందుబాటు ధరలకు పౌరసరఫరాల శాఖ సహకారంతో నిత్యవసర వస్తువులు అందించే విధంగా ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ మేరకు గురువారం ఎంపి, ఎంఎల్ఏ సంయుక్తంగా ప్రారంభించారు. ఒక్కరికి రెండు కిలోలు కంది పప్పు తగ్గించిన ధరలకు అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి సుధా కంటి ఆసుపత్రిచే ఉచిత రెటీనా వైద్య శిబిరం



తిరుపతి హెల్త్, జూలై 11 ప్రభాతవార్త : తిరుపతిలోని తిలక్ రోడ్‌లోని శ్రీ సాయి సుధా కంటి ఆసుపత్రిలో సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఉచిత రెటీనా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 50 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ కంటి మెనుక భాగంలో ఉండే సున్నితమైన పోరను రేటినా అంటారు. ఈ రెటీనా కాంతిని గ్రహించి మెదడుకు ప్రతిబింబాలను పంపుతుందని మధుమేహం ఉన్న వారిలో డయాబెటిక్ రెటినోపతి అనే కంటి వ్యాధి వస్తుందన్నారు. ఇలాంటప్పుడు రక్తంలో చెక్కర స్థాయిలు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతీస్తాయి. మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకున్నట్లయితే, స్మోకింగ్‌ని ఆపడం లాంటివి చేయడం ద్వారా డయాబెటిక్ రెటీనోపతి బారిన పడకుండా, కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చని ఆమె తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో హాస్పటల్ సిబ్బంది హిమబిందు, సునీత, మహేష్, నరేంద్ర, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారికి నిత్యం సేవచేసే రాజ్యం వచ్చింది

**-కేంద్ర సహాయమంత్రి సంజయ్**



తిరుమల,జులై 11 ప్రభాతవార్త : దేవదేవునికి నిత్యం సేవచేసే రాజ్యం వచ్చిందని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలోని ప్రదాని మోదీ ఆలయాల పవిత్రత కాపాడేలా చూస్తున్నారని కేంద్రహోమ్‌శాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. తెలుగు ప్రజలు సుఖసం తోషాలతో ఉండాలని దేవుని ప్రార్ధించినట్లు తెలిపారు. కేంద్రమంత్రి హోదాలో బండి సంజయ్ తొలిసారిగా గురువారం ఉదయం తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

## సంస్కృత వర్సిటీలో ఉచిత కంటి శిబిరం





తిరుపతి విద్య, జులై 11, ప్రభాతవార్త : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం డా. అగర్వాల్ కంటి ఆసుపత్రి, డా. యుగంధర్ స్కిన్ క్లినిక్ విశ్వ విద్యాలయ ంలోని ఉద్యోగులకు, విద్యార్థులకు, విశ్వవిద్యాలయంలోని ప్రతి ఒక్కరికి కంటి సంబంధిత వ్యాధులు, స్కిన్ సంబంధిత వ్యాధులు ఇతరత్రా అంశాలపైన ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా విశ్వవిద్యా లయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి ప్రతి ఒక్కరు కూడా ఆరోగ్యంగా ఉన్నప్పుడే వారి యొక్క విధులను చక్కగా చేయగలరని, అందువల్ల విశ్వవిద్యాలయం ఉద్యోగుల, విద్యార్థుల, విశ్వవిద్యాలయంలో పనిచేసే ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణ విషయంలో శ్రద్ధతో ముందుకు వెళ్తున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ. దక్షిణామూర్తి శర్మ, హెల్త్ సెంటర్‌లోని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్వేత, సిబ్బంది విక్టర్ బాబు, ఖేమ్ రాజ్ మీనా, సాయిచంద్, ప్రశాంతి, డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ స్టాఫ్ మెంబర్స్ అలోక్ వర్మ, బి. దోరవేలు, పిఆర్‌ఓ జై చంద్ర, డాక్టర్ యుగంధర్ స్కీన్ ఏజర్ క్లినిక్ డాక్టర్ గౌతమి, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి సంజయ్‌కు శుభాకాంక్షలు



తిరుపతిహెల్త్, జూలై 11ప్రభాతవార్త: కేంద్రహోమ్‌శాఖ సహాయమంత్రి బండి సంజయ్ జన్మదినం సందర్భంగా పలువురుతిరుపతి నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారి దర్శనానంతరం తిరుపతికి వచ్చిన కేంద్రమంత్రిని తెలుగుదేశం నేత పాశకం వెంకటేశ్, జనసేననేతలూ ఆరణి శివకుమార్, బిజెపి సామంచి శ్రీనివాస్ కలసి దుశ్శాలువ కప్పి సన్మానించారు.

## ఘనంగా ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



శ్రీకాళహస్తి, జూలై 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి ఏపిఎస్ఆర్టీసి డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా గౌరవాధ్యక్షులు, మాజీ దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు హజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్‌చేసి యూనియన్ నాయకులకు కార్మికులకు పంపిణీచేసి ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులకు ఉద్యోగులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో రాజకీయ ఒత్తిళ్ళతో యూనియన్‌కు దూరమైన వారు కూడా తిరిగి యూనియన్‌లోకి రావాలని పిలుపు నిచ్చారు. అనంతరం గౌరవాధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పిఎస్‌కుమార్, జిపిఎస్ ఆచారి, రోశయ్య, మురళీ, రమేష్, ప్రసాద్, ఎంఎంరత్నం, కత్తిరవి తదితరులు పాల్గొన్నారు.

## పూతలపట్టు నియోజకవర్గంలో... పరిశ్రమల స్థాపనకు కృషి

**-పక్కరాష్ట్రాలకు వలసలు పోకుండా చూస్తా : ఎమ్మెల్యే**



తిరుమల,జులై11 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో ఎక్కువభాగం గ్రామీణ ప్రాంతంగా ఉన్న పూతలపట్టు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారం తీసుకుంటానని, అక్కడ పరిశ్రమలు తీసుకువచ్చే దిశగా తనవంతు పనిచేస్తానని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాన్ అభివృద్ధికి ముందుంటు న్నారన్నారు. వారి సహాయ సహకారాలతో, ఆశీస్సులతో పూతలపట్టును అభివృద్ది చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాలనుండి పక్కరాష్ట్రాలకు ఉపాధి కోసం వలసపోకుండా ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తానన్నారు. తిరుపతి-బెంగుళూరు ప్రధాన జాతీయ రహదారిలో పూతలపట్టు ఉండటంతో ఇక్కడ మౌళిక వసతులు మెరుగుపరచి జనం ఉన్నచోట పనిచేసుకునేలా, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూస్తానాన్నరు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలుఅందజేశారు.

## అధిక జనాభా పెరుగుదల సవాళ్లను అధిరోహించాలి



తిరుపతి విద్య, జూలై 11 ప్రభాతవార్త : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థాన నిర్వహణలో ఉన్న శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభా వలన ఎన్నో సవాళ్లు ఎదురౌతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల భౌగోళిక శాస్త్ర అధ్యాపకురాలు డి. అనురాధ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక జనభా, యువత కలిగిన భారత దేశం, విద్య, ప్రపంచ స్థాయి నైపుణ్యాలు వారిలో పెంచితే, యువ భారత సమగ్రాభివృద్ధి సాధ్యమౌతుందని, అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. సిఎల్ చెన్నా రెడ్డి, డా. వి. ప్రసన్న లక్ష్మి, వై. మహేశ్వరయ్య ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత





రేణిగుంట జులై11 ప్రభాతవార్త : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరునిపై ఉందని శ్రీచైతన్య పాఠశాలల ఏజిఎం సురేష్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక శ్రీచైతన్య పాఠశాలల ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు రేణిగుంట పురవీదుల్లో ర్యాలీని నిర్వహించి పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. అందరూ మెక్కలను నాటాలని, ప్రధాని నరేంద్ర మెదీ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ వారి వారి తల్లిదండ్రుల పేరుమీద మొక్కలను నాటే అలవాటు చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపాల్ చారుమతి మాట్లాడుతు పారిశ్రామికతంగా ప్రపంచం అభివృద్ధి చెందుతున్న తరుణంలో , ఆయా కంపెనీల నుండి వెలువడే వ్యర్థాల వలన పర్యావరణం కూడా అంతే వేగంగా నాశనం అవుతుందన్నారు. గ్లోబల్ వార్మింగ్ పెరిగి రాబోయ్యే తరాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదురొ ్కనే అవకాశం ఉందన్నారు. దీనిని నివారించేందుకు అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గ ించాలని, వాహనాలను కూడా పరిమితంగా వినియోగించాలని కోరారు. పారిశ్రామిక వాడల్లో కాలుష్యాన్ని నివారించేందుకు ప్రభుత్వ నిభందలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటి పార్యవరనాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డీన్ గోవర్ధన్, ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హాస్పిటల్లో పారిశుద్ధ్య కార్మికుల నూతన కమిటీ ఏర్పాటు



తిరుపతి హెల్త్, జులై 11 ప్రభాతవార్త : ఏవన్ సర్వీసెస్ కాంట్రాక్టర్ల వేధింపులు ఆపాలి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రలు పిలుపునిచ్చారు. గురువారం మెటర్నటీ హాస్పిటల్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం మెటర్నిటీ హాస్పిటల్ ఆవరణలో నిర్వహించారు. ఏఐటీయూసి ఆధ్వర్యంలో మెటర్నటీ హాస్పిటల్లో పారిశుద్ధ్య కార్మికుల నూతన కమిటీ నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెటర్నిటీ ఆసుపత్రిల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని అడిగితే కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారని లెక్కలేని సమాధానాలు చెప్తున్నారని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం సక్రమంగా చెల్లించడం లేదని పిఎఫ్ అకౌంట్‌లో కార్మికుల డబ్బులు జమ కావడం లేదని కార్మికుల సంఖ్యను పెంచాలని నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలని గుర్తింపు కార్డులు డిఎంహెచ్ ద్వారా ఇప్పించాలని అలాగే నాణ్యమైన పరికరాలు వస్తువులు కార్మికులందరికి అందచేయాలని అందుకోసం ఏఐటియుసి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 18వ తేదిన మెటర్నిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వాలని అలాగే కాంట్రాక్టర్లతో కార్మికుల జీతాలు పిఎఫ్ ఖాతాల్లో డబ్బులు జమ ఈఎస్ఐ కార్డుల పంపిణీ తదితర సమస్యలపై చర్చించాలని సమావేశం తీర్మానించారు.

## ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంట్రల్ పూర్తి చేయాలి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జులై 11 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో ఏర్పాటు చేయనున్న ట్రాఫిక్ సిగ్నల్స్, సిసి కెమెరాల కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంట్రల్ పూర్తి చేయాలని కమిషనర్ అధితి సింగ్ పేర్కొన్నారు. గురువారం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల నిర్వహణ భాగస్వామ్యులతో స్మార్ట్ సిటీ ఎండి అధితి సింగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరు గురించి ప్రాజెక్టు మేనేజ్మెంట్ కన్సల్టింగ్, ఐ ట్రిపుల్ సి క్రాంటాక్టింగ్ ఏజెన్సీ వారు వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి, తిరుపతి మున్సిపాల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ మాట్లాడుతూ అన్ని శాఖ సమన్వయంతో ఐ ట్రిపుల్ సి ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుతో నగరంలో ఏర్పాటు చేయబోయే సిసి కెమెరాల పని తీరుతో మరింత మెరుగు ఫలితాలు సాదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి పోలీస్ ఏఎస్పి కులశేఖర్, ట్రాఫిక్ డిఎస్పి రమణ కుమార్, టెలీకామ్ జిఎం వెంకోబరావు, ఎపిఎస్పిడిసిఎల్ ఎస్ఇ సురేంద్ర నాయుడు, మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ, మేనేజర్ చిట్టిబాబు, ఎస్ఈసి పిఎంసి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రియభక్తుడి భుజస్కంధాలపై శ్రీరామచంద్రుడు



చంద్రగిరి, జూలై 11 ప్రభాతవార్త: ప్రియభక్తుడైన హనుమంతుని వాహనంగా చేసుకుని శ్రీరామ చంద్రుడి అవతారంలో కళ్యాణ వెంకన్న తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరిం చుకుని ఉదయం నుండి శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్స్ టి.వెంకటస్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటు ధరలో నిత్యవసర సరుకులు : జేసి

తిరుపతి కార్పొరేషన్, జులై 11, ప్రభాతవార్త : ప్రజలకు కందిపప్పు, బియ్యం అందుబాటు ధరలలో లభించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సంయుక్త కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్ఎం పేర్కొన్నారు. గురువారం తిరుపతి రైతు బజార్‌లో కందిపప్పు, బియ్యం ప్రజలకు అందుబాటు ధరలకు ఉండేలా ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు అదుపులో ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ధరలను తగ్గించి అదుపులో ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ధరలను తగ్గించి వినియోగదారులకు ఉపశమనం కలిగించటానికి ప్రభుత్వ స్థాయిలో హోల్సేల్ కిరాణా మర్చెంట్స్, రైస్ మిల్లర్స్ ప్రతినిదులతో రాష్ట్ర స్థాయిలో ఒక సమావేశం ఏర్పాటు చేసి నిత్యావసర సరుకుల ధరలు తగ్గించి వినియోగదారులకు అందించే విధంగా ఒప్పందం కుదుర్చుకుందని, ఈ ఒప్పందంలో భాగంగా జిల్లాలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హోల్సేల్ కిరాణా మర్చెంట్స్ అసోసియేషన్, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దాదాపు 16 కౌంటర్లను ఏర్పాటు చేసి అందులో తిరుపతి, గూడూరులోని రెండు రైతు బజారు కౌంటర్లతో పాటు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ముగిసిన ఎస్వియు నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు

**ప్రెసిడెంట్‌గా శ్రీధర్ గుర్రంకొండ-సెక్రటరీగా ఎం. సుబ్రమణ్యం గెలుపు**





తిరుపతి విద్య, జులై 11 ప్రభాతవార్త : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రంలో శ్రీవారి పాదాల చెంత వెలసిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గురువారం ప్రశాంతంగా ఎస్వీయూ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ 16వ ఏడాది ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా శ్రీధర్ గుర్రంకొండ, సెక్రటరీగా ఎం సుబ్రమణ్యం గెలుపొందారు. ఇంతకుముందే 19 మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయం అందరికీ విధితమే. ఈసీ మెంబర్లుగా ఎస్వీయూ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన దేవూర్ గ్రూపు ప్రసాద్, అలాగే వెంకట శివారెడ్డి, నాలుగవ పర్యాయం ఈసీ సభ్యులు డాక్టర్ వాసపల్లి హరిబాబులతో పాటు మరింత మంది ఈసీ సభ్యులు అఖండ మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలో గెలుపొందిన అభ్యర్థులు వారి అభిమానులు ఓటర్లు పెద్ద ఎత్తున టపాకాయలు పేర్చి కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గెలుపొందిన అభ్యర్థులను తోటి ఓటర్లు స్నేహితులు శ్రేయోభిలాషులు శాలువా పుష్ప పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎస్వియు మీడియా కార్ కోఆర్డినేటర్ మనోజ్ కుమార్ సింగ్, అభ్యర్థులు ఓటర్లు స్నేహితులు శ్రేయోభిలాషులు నాన్ టీచింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.